క్లుప్తంగా

నేడు ఒంగోలు అసెంబ్లీ స్థాయిలో వలంటీర్లకు వందనం

ఒంగోలు: ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని స్థానిక ఏ1 ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారు. నియోజకవర్గ పరిధిలోని వలంటీర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు, మండల/క్లస్టర్ ఇన్‌చార్జులు, డివిజన్ల అధ్యక్షులు, మండల సచివాలయ కన్వీనర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని వలంటీర్లకు కృతజ్ఞతలు తెలియజేయాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కార్యాలయ ప్రతినిధి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

మద్దిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఇన్‌చార్జి ఏఈ చెన్నారెడ్డి తెలిపారు. వెల్లంపల్లి గ్రామ సమీపంలో టవర్‌లైన్ వర్క్ జరుగుతున్న నేపథ్యంలో వెల్లంపల్లి, కొలచనకోట, మల్లవరం, అన్నంగి, గుండ్లాపల్లి, గార్లపాడు, ఘడియపూడి పునరావాసకాలనీలు, బూరేపల్లి, కీర్తిపాడు, గాజులపాలెం, రాచవారిపాలెం, నాగన్నపాలెం గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఇన్‌చార్జి ఏఈ తెలిపారు. వీలైన పక్షంలో కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు


మద్దిపాడు ఎస్ఐ మహేష్


ఎంపీడీఓ శ్రీహరి

మద్దిపాడు: మద్దిపాడు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా వెలగా మహేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2014 ఎన్నికల సమయంలో ఇదే పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎవరైనా అరాచకాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే తనకు సమాచారం ఇవ్వాలని మండల ప్రజలను కోరారు.

ఎంపీడీఓగా శ్రీహరి...

మద్దిపాడు ఎంపీడీఓగా సీహెచ్ శ్రీహరి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు.

యానాదులకు సభ్యత్వం కల్పించాలి


సమావేశంలో పాల్గొన్న యానాది సంఘాల మహాకూటమి నాయకులు

ఒంగోలు సెంట్రల్: ప్రకాశం జిల్లా మోపాడు ముచ్చుపాద గిరిజన మత్స్యకార సహకార సంఘంలో యానాదులకు స్కిల్ టెస్టు జరిపి లైసెన్స్‌లు మంజూరు చేయాలని యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి కోరారు. ఒంగోలు ప్రెస్‌క్లబ్‌లో శనివారం మోపాడు ముచ్చుపాద గిరిజన మత్స్యకార యానాదులు సమావేశం నిర్వహించారు. మోపాడు రిజర్వాయర్ పరిధిలో ఏడు చెరువులు ఉండగా, 40 మంది సభ్యులున్నారని తెలిపారు. వీరిలో ఏడుగురు మాత్రమే యానాదులు ఉన్నారని తెలిపారు. అందులో ఎక్కువ మంది గిరిజనేతరులు ఉండటం అన్యాయమన్నారు. యానాదుల ప్రధాన వృత్తి చేపలు పట్టడం అయినందున గిరిజన మత్స్యకార సంఘంలో యానాదులకు సభ్యత్వం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పోట్లూరి లక్ష్మయ్య, నాయకులు రావూరి శ్రీనివాసులు, కనకయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

టీడీపీ వాళ్లకు ఓట్లు అడిగే హక్కులేదు

- 14 ఏళ్లు సీఎంగా చంద్రబాబు చేసిందేమీ లేదు
- ప్రతి మహిళకు లబ్ధి చేకూరేలా సీఎం జగన్ సంక్షేమ పథకాలు
- చీమకుర్తిలో వైఎస్సార్ సీపీ ప్రచారంలో మంత్రి మేరుగు నాగార్జున


పేదలకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: టీడీపీ వాళ్లకు ఓట్లు అడిగే హక్కు లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు ఇన్‌చార్జి మేరుగు నాగార్జున అన్నారు. శనివారం రాత్రి స్థానిక 2వ సచివాలయం పరిధిలోని నెహ్రూనగర్‌లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో మంత్రి నాగార్జున ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉన్న 14 ఏళ్లలో పేద ప్రజలకు ఒక్కటంటే ఒక్క పథకమైనా అందించారా..? అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా అందజేసిన సంక్షేమ పథకాలన్నీ మహిళల పేర్ల మీదనే అని గుర్తు చేశారు. 14 సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రజలను చంద్రబాబు మోసం చేస్తుంటే.. ఇంకొకాయన సినిమారంగం నుంచి వచ్చి కాపు సామాజిక వర్గాన్ని మోసం చేస్తున్నాడని పవన్‌కల్యాణ్‌పై మంత్రి సెటైర్లు వేశారు.

సీఎం అందిస్తున్న సంక్షేమ పథకాలు తిరిగి పేద ప్రజలకు అందాలంటే మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం కావాలన్నారు. సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ తరఫున పోటీచేస్తున్న తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, స్థానిక కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, తప్పెట బాబూరావు, గోపురపు చంద్ర, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మంచా హరికృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెరిగిన ప్రచారం స్పీడు


మహిళను ఆప్యాయంగా పలకరిస్తున్న బాలినేని శచీదేవి

- ఒంగోలు 44వ డివిజన్‌లో గడపగడపకు బాలినేని కుటుంబం

ఒంగోలు: నగరంలో వైఎస్సార్ సీపీ ప్రచారం ఊపందుకుంది. స్థానిక 44వ డివిజన్‌లో రెండోరోజు ప్రచారంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచీదేవి, కోడలు శ్రీకావ్య, శ్రీకావ్య వదిన కుందా లిఖిత పాల్గొని ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరించి ఆదరణ పొందారు. అవ్వా పెన్షన్ వస్తుందా..? అని అడిగితే.. వస్తుందమ్మా.. ఫస్ట్ తారీకునే ఇస్తున్నారమ్మ అని ఆప్యాయంగా వృద్ధులు చెబుతున్నారు. గత ప్రభుత్వానికి, ఇప్పటికి తేడా ఏమిటో స్వయంగా వివరిస్తున్నారు. తమలాంటి ముసలోళ్ల దీవెనలు జగన్‌బాబుకు తప్పకుండా ఉంటాయని అంటున్నారు. జగన్‌ను కాదని చంద్రబాబుకు ఓటేస్తే మళ్లీ తమకు తిప్పలు తప్పవని అంటున్నారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వాసన్నను గెలిపించాలంటూ బాలినేని కుటుంబ సభ్యులు కోరారు. బాలినేని శచీదేవి మాట్లాడుతూ నేడు ప్రతిఒక్కరూ చైతన్యం అయ్యారని, అవాస్తవాలతో నమ్మించాలని చూస్తే అది సాధ్యం కాదని అన్నారు. అందుకే వాస్తవాలను బేరీజు వేసుకుని వాసన్నకు అండగా ఉండాలని తాము కోరుతున్నామన్నారు. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు దేశంలోనే చారిత్రాత్మకం అని వివరించారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను తీసుకురావడం ద్వారా ప్రజల వద్దకే పాలన అందుతుందన్నారు. విజన్ అంటే వైఎస్సార్ సీపీదని, రాబోయే ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ గోపిరెడ్డి గోపాల్‌రెడ్డి, 45వ డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస కుమారి వెంకటేశ్వరరెడ్డి, 45వ డివిజన్ అధ్యక్షుడు పల్నాటి రవీంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్, జిల్లా, నగర అధ్యక్షులు బడుగు ఇందిర, తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ,


మహిళలతో మాట్లాడుతున్న బాలినేని శ్రీకావ్య

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి అరుణ, ఆగ్రోస్ కార్పొరేషన్ డైరెక్టర్ పురిణి ప్రభావతి, సాహిత్య అకాడమీ డైరెక్టర్ బొప్పరాజు జ్యోతి, కార్పొరేటర్లు తాడి కృష్ణలత, బేతంశెట్టి శైలజ, పేర్నమిట్ట రాజేశ్వరి, రావులపల్లి ధనలక్ష్మి యాదవ్, రాష్ట్ర కార్యదర్శి లీలాకుమారి, ఏపీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కాకి కృపారావు, ప్రధానోపాధ్యాయుల సంఘం రిటైర్డ్ నాయకుడు పల్లెర్ల నరసింహారెడ్డి, పాతకొట్టు వెంకటేశ్వరరెడ్డి, మోతడిక అంకయ్య, బెల్లంకొండ అశోక్, ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి, సేవాదళ్ నగర అధ్యక్షుడు వల్లెపు మురళి, వీరాంజనేయస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ దుగ్గిరెడ్డి ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈలకు నైపుణ్యాలు పెంచడమే లక్ష్యం

- కేంద్ర ప్రభుత్వం ర్యాంపు అనే స్కీము ప్రారంభం
- ఎంఎస్‌ఎంఈ వన్ అనే ఏకీకృత పోర్టల్ కూడా ప్రారంభం
- సర్వేకు పూర్తి స్థాయిలో సహకరించాలి
- జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాస రావు

ఒంగోలు సబర్బన్: మీడియం, స్మాల్, మార్జినల్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (ఎంఎస్‌ఎంఈ)ల పనితీరును మెరుగుపరచటంతో పాటు వాటి అభివృద్ధిని వేగవంతం చేయటం కోసం నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన మెళకువలు అలవరచటమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ (జీఎం) శ్రీనివాస రావు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే స్కీమును ప్రకటించిందన్నారు. అందులో భాగంగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఫిబ్రవరి 14న ర్యాంపు స్కీముకు చెందిన ఏపీఎంఎస్‌ఎంఈ వన్ అనే ఏకీకృత పోర్టల్‌ను కూడా ప్రారంభించారని వెల్లడించారు. ర్యాంపులోని ఒక అంశమైన ఎంఎస్‌ఎంఈల ఫార్మలైజేషన్‌లో భాగంగా రాష్ట్రంలోని అన్ని ఎంఎస్‌ఎంఈలను సర్వే చేయటం కోసం ప్రభుత్వ పరిశ్రమల శాఖ ద్వారా జీఓ ఎంఎస్ నంబర్-24 జారీ చేసిందన్నారు. ఈ సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లోని అన్ని ఎంఎస్‌ఎంఈలను సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్ ఫామ్‌లోనికి ఏపీఎంఎస్‌ఎంఈ వన్ (ఏపీఎంఎస్‌ఎంఈ వన్) పోర్టల్‌కు అనుసంధానిస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అమెనిటీ సెక్రటరీస్ ఈ సర్వేను మార్చి1 నుంచి 20వ తేదీ వరకు చేపడతారన్నారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ల ద్వారా ఈ సర్వే పురోగతిని జిల్లా పరిశ్రమల కేంద్రం నిర్వహిస్తుందన్నారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలోని అన్ని ఎంఎస్‌ఎంఈల డేటా బేస్‌ను అభివృద్ధి చేస్తారని చెప్పారు. వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కల్పిస్తారని వెల్లడించారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు నైపుణ్యాలను అభివృద్ధి పరచటంలాంటి సేవలను ఎంఎస్‌ఎంఈలకు కల్పిస్తారని వివరించారు. సర్వేలో గుర్తించిన నమోదు కానీ ఎంఎస్‌ఎంఈలకు అవగాహన శిబిరాలను నిర్వహించి ఉద్యం లేదా ఉద్యం అసిస్ట్ ద్వారా నమోదు చేస్తామన్నారు. ఈ విధంగా చేయటం ద్వారా వివిధ రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందేందుకు అర్హులవుతారన్నారు. తద్వారా బ్యాంకు రుణ సదుపాయాలు సులభతరం అవుతాయని వెల్లడించారు. ఎంఎస్‌ఎంఈలు, వాటి అసోసియేషన్లు, ఇతర పరిశ్రమల అసోసియేషన్లు, వర్తక, వాణిజ్య సంఘాలు సర్వే టీమ్‌లకు సహకరించాలని జీఎం విజ్ఞప్తి చేశారు. సర్వేకు అవసరమైన వివరాలు అందించి సర్వేను విజయవంతం చేయాలని కోరారు.

సెలవు పెట్టి వెళ్తే..పాఠాలెవరు చెబుతారు..?

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం

చీమకుర్తి: ముగ్గురు టీచర్లు ఉండాల్సి ఉంటే ఒక టీచర్ సెలవు పెట్టి విదేశాలకు వెళ్లటంతో ఆ టీచర్ బోధించే పాఠాలు, సిలబస్ ఎవరు పూర్తి చేస్తారు? ఆ టీచర్‌కు సెలవు ఎలా మంజూరు చేశారంటూ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఈఓని ప్రశ్నించారు. ఎంఈఓ వద్ద సంజాయిషీ తీసుకోవాలని ఆర్‌జేడీని ఆదేశించారు. చీమకుర్తి మండలం ఇలపావులూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ సందర్శించినప్పుడు ఈ సంఘటన జరిగింది. పక్కనే ఉన్న గోనేపల్లివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు టీచర్లకు గాను ఒక టీచర్ ఇంటర్ పరీక్షల డ్యూటీకి వెళ్లారు. ఇంటర్ పరీక్షలకు వెళితే పాఠశాలలో పాఠాలు ఎవరు చెబుతారన్నారు. వెంటనే ఇంటర్ పరీక్షలకు డ్యూటీలు వేసిన ఉపాధ్యాయులందరినీ విధుల నుంచి విడుదల చేయాలని జూనియర్ కాలేజీల ఉన్నతాధికారి ఆర్ఐఓని ఆదేశించారు. అనంతరం గాడిపర్తివారిపాలెం జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన బైజూస్ ట్యాబ్‌లు పనిచేయకపోవడంతో ట్యాబ్‌లకు సంబంధించిన ఇన్‌చార్జిని మందలించారు. నాడు-నేడు ద్వారా హైస్కూలులో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడంపై ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం చీమకుర్తి మండలం నుంచి పొదిలి మండలం వెళ్లారు.


విద్యార్థుల నోట్స్‌లను పరిశీలిస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

ఈ పర్యటనలో ప్రవీణ్ ప్రకాష్ వెంట ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈఓ సుభద్ర, డిప్యూటీ డీఈఓ రోజ్‌మేరీ, ఆర్ఐఓ ఒంగోలు ఎంఈఓ టీ.కిషోర్‌బాబు, చీమకుర్తి ఎంఈఓలు ఎస్.వెంకటేశ్వర్లు, కే.శివాజీ, ఎస్ఎస్ఏ ఈఈ భాస్కర్‌బాబు, మన్నయ్య పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోండి

చీమకుర్తి: చీమకుర్తిలోని 5వ సచివాలయంలో శానిటేషన్ సెక్రటరీగా పనిచేస్తున్న చుంచు భాగ్యలక్ష్మి, 2వ సచివాలయంలో వార్డు ప్లానింగ్ సెక్రటరీగా పనిచేస్తున్న ఆర్.కవితపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీకి చెందిన గుండా శ్రీనివాసరావు శనివారం ఇలపావులూరులో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌కు వినతిపత్రం అందించారు. గతంలో వారిద్దరిపై 5వ సచివాలయంలో పనిచేస్తున్న శింగయ్య, నాయుడుపాలెం పాఠశాలలో పనిచేస్తున్న రమణయ్య దాడిచేసి విచక్షణారహితంగా కొట్టారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వారిపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదైనా ఎవరూ స్పందించడం లేదన్నారు. బాధిత మహిళలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పన్నులు ఒకేసారి చెల్లిస్తే అపరాధ రుసుం రద్దు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థతో పాటు జిల్లాలోని అన్ని నగర పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పన్నులు ఒకేసారి చెల్లిస్తే ఆయా పన్నులపై విధించిబడిన అపరాధ రుసుం (వడ్డీ) మాఫీ చేస్తున్నట్లు ఒంగోలు నగర కమిషనర్ ఎం.జస్వంతరావు తెలిపారు. ఆ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెల్లించాల్సిన ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్నులను ఈ నెల 31వ తేదీలోగా ఏకమొత్తంగా చెల్లిస్తే సదరు పన్నుపై విధించబడిన అపరాధ రుసుం మొత్తం రద్దు చేస్తున్నామని వెల్లడించారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వంలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (సీ-2) డిపార్ట్‌మెంట్ జీఓ నంబర్-35 ద్వారా ఫిబ్రవరి 29వ తేదీ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆస్తిపన్ను, ఖాళీ పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

వాహన యజమానులు పన్ను బకాయిలు చెల్లించాలి

ఒంగోలు: వాహన యజమానులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన త్రైమాసిక పన్ను బకాయిలను తక్షణమే చెల్లించాలని రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లించకుండా వాహనాలు రోడ్డుపై కనిపించి వాహన తనిఖీదారులకు పట్టుబడితే 200 శాతం అపరాధ రుసుంతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాహనం నడిపేవారు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, బీమా, పొల్యూషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు.

8న ఎన్టీఆర్ కళాక్షేత్రంలో మహిళా మేలుకో

ఒంగోలు టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీ ప్రజాకళావేదిక ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కళాక్షేత్రంలో మహిళా మేలుకో అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళావేదిక అధ్యక్షుడు వెల్లంపల్లి ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కోలాటం మాస్టర్ నందవరపు జాన్‌కు ఆత్మీయ సన్మానం చేయనున్నట్లు చెప్పారు. అలాగే, వివిధ రంగాలలో ఎనలేని సేవలు చేస్తున్న పలువురు మహిళలకు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. నగర ప్రజలు, మహిళా నాయకులు, విద్యావంతులు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గ్రంథాలయాలతో జ్ఞాన జ్యోతులు

ఒంగోలు టౌన్: మూఢనమ్మకాలు, ఛాందస భావాల చీకట్లను తొలగించి జ్ఞాన జ్యోతులను వెలిగించేవే గ్రంథాలయాలని ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి అన్నారు. శనివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మనం-మన గ్రంథాలయం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పత్రిక విభాగం, పుస్తక విభాగం, రెఫరెన్స్ విభాగం, కంప్యూటర్లు, ర్యాకులలోని పుస్తకాలను శుభ్రం చేసి అమర్చారు. అలాగే గ్రంథాలయంలోపల బూజు దులిపి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారతదేశం గొప్ప సంస్కృతి కలిగిన దేశమని, అందుకు తగినట్లే అద్భుతమైన గ్రంథాలయాలను కలిగి ఉందని చెప్పారు. గ్రంథాలయాలు విద్యార్థులు, పరిశోధకుల అవసరాలు తీరుస్తున్నాయని చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లోని గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ తరచూ సందర్శించాలని, వారంలో ఒకరోజు తమ పిల్లలను గ్రంథాలయానికి తీసుకొచ్చి పుస్తకాలు చదవడం అలవాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కె.సంపూర్ణమ్మ, శివకుమారి, అనిల్ కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.